

భిక్కనూరులో తెగిన దర్శనమ్మ కుంట కట్ట



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం (ఇన్‌సెట్)లో బాధితురాలు అనసూయ

గాంధీనగర్‌లో చైన్ స్నాచింగ్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో గురువారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న అదే ప్రాంతానికి చెందిన అనసూయ మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్ చేసి వెళ్లినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దొంగతనం జరిగిన వెంటనే పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు అనసూయ తెలిపింది. సుమారు 3 తులాల బంగారు పుస్తెల తాడును ముఖానికి కర్చీఫులు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్లారని బాధితురాలు వాపోయింది. ఈ చోరీపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరిసరాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృష్యాలను పరిశీలించి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

- డీఎల్‌పీవో శ్రీనివాస్

భిక్కనూరు, సెప్టెంబరు 19: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భిక్కనూరు మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందరిమ్మ ఇళ్ల నిర్మాణాల్లో, బిల్లుల విషయంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఈవో మహేష్‌గౌడ్, ఆయా గ్రామపంచాతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడపడుచులు ఇష్టంగా నిర్వహించుకునే వేడుక బతుకమ్మ పండుగ. ఎంతో చరిత్ర కలిగిన బతుకమ్మ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కానుకగా మొదట రెండు చీరలను అందజేసేందుకు సిద్ధమైంది. కాగా తదితర కారణాల వల్ల ఒక్కటే 'సారీ' ఇచ్చేందుకు నిర్ణయించింది. గతంలో రేషన్‌కార్డుల ఆధారంగా చీరలు పంపిణీ చేయగా ఈసారి కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే ఈ చీరలు అందజేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే మహిళ సంఘాల సభ్యుల వివరాలను సేకరించారు. వీరందరికీ చీరలు పంపిణీ చేయనున్నారు. చీరల పంపిణీ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలు, మెప్మా సిబ్బందికి అప్పగించనున్నారు.



ఒక్కటే.. సారీ..

పండుగ కానుకగా స్వయం సహాయక సంఘాలకు బతుకమ్మ చీరలు

- జిల్లాలో 2,652 గ్రామ ఐక్య సంఘాలు, 17,203 స్వయం సహాయక సంఘాలు
- జిల్లా వ్యాప్తంగా 2.03 లక్షల మంది మహిళా సభ్యులు
- చీరల పంపిణీకి మార్గదర్శకాలు విడుదల చేయని ప్రభుత్వం

కామారెడ్డి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల స్థాయిలో నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలకు తరలించి మహిళా సభ్యులకు అందిస్తారు. రెండు రాకల సైజ్‌లలో 6.5 మీటర్లు, 9 మీటర్ల చీరలు అందుబాటులో ఉంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళ సంఘాలకు చీరలు ఇవ్వడం ఇదే మొదటిసారి. చీరల పంపిణీతో మహిళల గౌరవాన్ని పెంచడంతో పాటు చేనేత రంగానికి చేయూతను ఇస్తున్నామని ప్రభుత్వం పేర్కొంటుంది.

జిల్లాకు 2.03 లక్షల చీరలు

బతుకమ్మ పండుగ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాకు 2,03,689 చీరలను కేటాయించగా ఆ చీరలు రెండు, మూడు రోజుల్లో జిల్లాకు చేరుకోనున్నాయని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2.03 లక్షల మంది మహిళలు ఉండగా 10 శాతం అదనంగా చీర ల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. చీరలు త్వరలోనే రానున్నాయి. మహిళా సంఘాల సభ్యులకు ఒక్కోటి చొప్పున అందించనున్నారు.చీరల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. సర్కార్ నుంచి అధికారికంగా మార్గదర్శకాలు వచ్చిన వెంటనే మండలాలు, గ్రామాల వారీగా పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న చీరల కానుక ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ప్రతీ ఇంటికి చేరే ఈ చీరలు బతుకమ్మ పండుగను మరింత రంగుల మయం చేయనున్నారు.

మహిళా సంఘాల సభ్యులకే..

గత ప్రభుత్వ హయాంలో 18 సంవత్సరాలు నిండిన తెల్ల రేషన్‌కార్డులు కలిగిన యువతలు, మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని గ్రామ సమైక్య, స్వయం సహాయక సంఘాల ద్వారా పంపిణీ చేస్తూ సంఘంలో ఉన్న సభ్యులకు అందించే విధంగా మండల స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించనుంది. జిల్లాలో డీఆర్‌డీవో పరిధిలో 17,203 గ్రామ స్వయం సహాయక సంఘాలు ఉండగా వీటి పరిధిలో 1,79,417 మంది మహిళ సభ్యులు ఉన్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని మెప్మా పరిధిలో 2,652 సమైక్య సంఘాలు ఉండగా వీటి పరిధిలో 24,272 మంది సభ్యులు ఉన్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 2,03,689 మంది మహిళ సభ్యులు ఉండగా వీరందరికీ బతుకమ్మ కానుకగా చీరలు అందించనున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కో చీర

గత ప్రభుత్వ హయాంలో చీరల నాణ్యత పరంగా కొంతమంది మహిళలు అసంతృప్తిని వ్యక్తి చేసి నిరసన తెలిపిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యత పరంగా జాగ్రత్తలు తీసుకుంటూ డ్రెస్ కోడ్‌లో భాగంగా అన్నీ ఒకే రంగుతో ఒకే విధంగా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మొదట రెండు చీరలు ఇవ్వాలని భావించినప్పటికీ ప్రస్తుతం ఒక్క చీర అందించనున్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా 6.30 మీటర్ల చీరలు, 9 మీటర్ల చీరలు సిద్ధం చేశారు.

త్వరలోనే జిల్లాకు బతుకమ్మ చీరలు

- సురేందర్, డీఆర్‌డీఏ పీడీ, కామారెడ్డి

బతుకమ్మ పండుగ నేపథ్యంలో ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాలో ఎన్ని చీరలు అవసరమవుతాయనే దానిపై ఇది వరకే ప్రభుత్వానికి నివేదించాం. జిల్లా వ్యాప్తంగా 2.03 లక్షల మంది మహిళా సభ్యులు ఉన్నారు. వీరందరి వివరాలను ప్రభుత్వానికి పంపాం. దీని ఆధారంగా ప్రభుత్వం త్వరలోనే జిల్లాకు చీరలను పంపనుంది. చీరల పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేయగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధుల చేత చీరలను పంపిణీ చేస్తాం.

దర్శనమ్మ కుంట మరమ్మతు పనులు ఎప్పటికి జరిగేనో?

- ఇబ్బందుల్లో ప్రజలు

భిక్కనూరు, సెప్టెంబరు 19: భిక్కనూరు మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలోని గిద్ద హరిజనవాడకు వెళ్లే దారిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన గల దర్శనమ్మ కుంట కట్ట తెగిపోయింది. కట్ట తెగిపోయి దాదాపుగా 20 రోజులు గడుస్తున్నా ఈ కుంట కట్టను పట్టించుకునే నాథుడు లేక, ఈ తెగిన కుంటకు మరమ్మతులు చేయకపోవడంతో గిద్ద హరిజనవాడ కాలనీలోని ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఎల్లమ్మ ఆలయం నుంచి చుట్టూ దాదాపుగా రెండు కిలో మీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది. కాలనీ నుంచి ఎవరైనా ఆసుపత్రికి గానీ, చౌరస్తాకు గానీ రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ తెగిన కుంట కట్టను జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ గత పది రోజుల క్రితమే సందర్శించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించినా ఇప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా కుంట కట్టకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కురుస్తున్న వర్షాలకు వచ్చే వరద నీరు కుంటలో నిల్వ ఉండకుండా కుంట కింద ఉన్న పంట పొలాల్లోకి వెళ్తుంది. దీంతో బాధిత రైతు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై జరిగే దాడులను అరికట్టాలంటూ శుక్రవారం కామారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట రామిరెడ్డి, దేవరాజ్ గౌడ్, భిక్షపతి, సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా స్వామిగౌడ్



మాచారెడ్డి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన బొంబోతుల స్వామిగౌడ్ నియామకమయ్యారు. ఇది వరకు చైర్మన్‌గా ఉన్న పూల్ చందునాయక్‌ను తప్పించి నూతనంగా స్వామిగౌడ్‌కు బాధ్యతలను అప్పగించారు. సింగిల్ విండో కార్యాలయంలో ఆడిట్ జరిగినప్పుడు సుమారు రూ.20లక్షల వరకు నిదులను గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే పాలకవర్గాన్ని మరో ఆరు నెలలు ప్రభుత్వం పొడగించడంతో పూల్ చందునాయక్‌ను తప్పించి డైరెక్టర్‌గా ఉన్న స్వామిగౌడ్‌ను చైర్మన్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాచారెడ్డి తాజా మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు, నయీంకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

డైరెక్టర్ పదవికి రామస్వామి రాజీనామా?

పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ రామస్వామి మాచారెడ్డి విండో చైర్మన్ పదవి రాకపోవడంతో డైరెక్టర్ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రెండు పర్యాయాలు డైరెక్టర్‌గా ఎన్నికైనా తనకు చైర్మన్ పదవి ఇవ్వకపోవడంతో డైరెక్టర్ పదవితో పాటుగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

అనగ'నగ'... ఇదో దగా..

- బంగారు దుకాణాలపై ఐటీ దాడులు
- హైదరాబాద్ డొంక ఇందూరులో కదిలింది

నిజామాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో క్యాప్సుల్ గోల్డ్ అనే దందా నిర్వాహకులపై ఐటీ దాడులతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డొంక కదిలింది. హైదరాబాద్‌లో 'క్యాప్సుల్ గోల్డ్' సంస్థ వద్ద పన్నులు చెల్లించని (జీరో మాల్) బంగారం కొనుగోలు చేసి జిల్లాలో విక్రయిస్తున్నరనే సమాచారంతో శుక్రవారం నగరంలో ముగ్గురు వ్యాపారుల దుకాణాల్లో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. ఐటీ అధికారుల దాడులు నగరంలో కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వానికి పన్ను ఎగవేత ద్వారా 10 గ్రాముల బంగారానికి సుమారు 9వేల నష్టం వాటిల్లుతుంది. జీఎస్టీతో పాటు అమ్మకపు పన్ను లేకుండా జీరోలో బంగారం కొనుగోలు చేసి విక్రయించే వారి దందా చాలా రోజుల నుంచి జిల్లాలో ఉంది. తక్కువ ధరకు బంగారు విక్రయం పేరిట మార్కెట్ రేటు కంటే మూడు నుంచి నాలుగు వేలకు తక్కువకు అమ్ముతూ సొమ్ము చేసుకునే దందాను కొందరు వ్యాపారులు నిర్వహిస్తున్నారు. వారి జీరో వ్యాపారం పేరిట బంగారం ఆర్డర్ల ప్రకారం తీసుకొని జీరోలో సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే దాడులు జరిగినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలో జీరో దందా నిర్వహించే వ్యాపారుల దుకాణాలపై దాడులు బంగారు వర్తకుల్లో గుబులు రేపుతుంది.

నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి మెమోలు జారీ చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్యక్రమాల్లో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ సిబ్బందికి మెమోలు జారీ చేయాలని కలెక్టర్ ఆశీష సాంగ్వాన్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపాలిటీలోని 15వ వార్డులో గల వినాయక్‌నగర్‌లో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను తనిఖీ చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీల అత్యవసరంగా పునరుద్ధరణకు ఎస్‌డీఆర్ఎఫ్ కింద మంజూరు అయిన పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించని కారణంగా వెంటనే సంబంధిత ఏరియా సానిటరీ జవాన్, ఇన్స్‌పెక్టర్‌లకు మెమోలు జారీ చేసి 24 గంటల్లో సమాదానం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో ఉన్నత స్థాయిలో నిలపాలి

జిల్లాను విద్యారంగంలో ఉన్నత స్థాయిలో నిలపాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బోధనా భ్యాస సామగ్రి మేళా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మారుతున్న సాంకేతికకు తగ్గట్టుగా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో పునాది బలంగా ఉంటేనే ఉన్నత విద్యలో రాణించగలుగుతారని తెలిపారు. విద్యార్థులు వినడం కంటే నమూనాలను ప్రత్యక్షంగా చూడడం ద్వారా అధికంగా నేర్చుకోగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా సమగ్రశిక్ష సమన్వయ కర్తలు వేణుగోపాల్, నాగవేందర్, రమణరావు, పరీక్షల విభాగం కమిషనర్ బలరాం, డీసీఈబీ కార్యదర్శి లింగం, ఎంఈవో ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని 15వ వార్డులో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

డీఎస్ఆర్ కమిటీ సమావేశం

కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లభ్యమయ్యే ఇసుక, ఇతర చిన్న ఖనిజాలపై జిల్లా సర్వే రిపోర్టు తయారీ చేయాలని తెలిపారు. సుప్రీం, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ మార్గదర్శకాల ప్రకారం భవిష్యత్తులో ఇసుక తవ్వకాల అనుమతులు ఇవ్వడానికి డీఎస్ఆర్ సమర్పణ తప్పనిసరి అని తెలిపారు. జిల్లాలోని గనుల కార్యకలాపాలు, లీజులు, రాయల్టి ఆదాయం, ఇసుక ఉత్పత్తి, వర్షపాతం, భౌగోళిక పరిస్థితులు,అటవీ ప్రాంతాలు, నదులు, వాగులు, ఇసుక అందుబాటులో వంటి వివరాలు పొందుపరచబడతాయని తెలిపారు. వీటి లభ్యత వివరాల డేటా సేకరణను మూడు రోజుల్లో పూర్తిచేసి సెప్టెంబరు చివరి నాటికి రిపోర్టు సిద్ధం చేసి అక్టోబరు మొదటి వారం ప్రజాభిప్రాయం కోసం జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచబడుతుందని తెలిపారు. ప్రజల నుంచి అందిన సూచనలను పరిగణలోకి తీసుకుని తుది రిపోర్టును నవంబరు మొదటి వారంలో టీజీఎండీసీకు సమర్పించనున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, సహాయ సంచాలకులు గనులు, భూగర్భశాఖ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రవీణ్

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

దోమకొండ: బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి వసతి గృహ ప్రత్యేకాధికారి ప్రవీణ్ భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. సమస్యలు ఉంటే తనకు తెలపాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ స్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22న సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో సబ్‌జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాణాల భాస్కర్ రెడ్డి తెలిపారు. బాలబాలికల కబడ్డీ జట్లు ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లోని ముప్కాల్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి 35వ సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9398571110 నెం బర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెలవారి సమీక్ష సమావేశంలో భాగంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పాత, కొత్త కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించే దిశగా పని చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర న్యాయం చేయాలని అన్నారు. దొంగతనం, ఆస్తి సంబంధిత నేరాలకు సంబంధించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, కొత్తగా ఏఎంబీఐఎస్ టెక్నాలజీని వినియోగించి ఫాస్ట్‌ప్రింట్ ద్వారా కేసులను ఛేదించాలని సూచించారు. ఎన్‌డీపీఎస్ కేసులలో నేరస్తులపై హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డయల్ 100 ద్వారా కాల్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు రెగ్యులర్‌గా నిర్వహించాలని సూచించారు. ప్రతిరోజూ డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఫేక్ నెంబర్ ప్లేట్లు, నెంబర్ ప్లేట్లు మార్పుపై (మిగతా 8వ పేజీలో)



హోంగార్డులకు రేయిన్‌కోట్స్ అందిస్తున్న ఎస్పీ

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



మద్నూర్ కేజీబీవీ గురుకుల విద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మద్నూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే గౌరమ్మ.. తంగేడు పువ్వొప్పునే గౌరమ్మ.. తంగేడు కాయొప్పునే గౌరమ్మ.. అంటూ మహిళలు బతుకమ్మ సంబరాలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ముందుగానే విద్యాలయంలో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ సత్యశీల తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలకు బతుకమ్మ పండుగ నిలువుటద్దం. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మ ఉత్సవాలను మహిళలు తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. అందులో భాగంగానే ముందస్తుగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించి బతుకమ్మ పాటలు పాడుకున్నారు.

క్రైం సమాచారం

నాగేపూర్ శివారులో మృతదేహం లభ్యం

● హత్యగా పోలీసుల అనుమానం..!

నవీపేట,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): నాగేపూర్ శివారులో శుక్రవారం సుమారు 30-35 ఏళ్ల యువకుడి కుళ్లిన మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. మద్దెపల్లి నుంచి మట్టయ్యఫారం వెళ్లే దారి పక్కనే ఉన్న గుట్టరాళ్ల మధ్యన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందన్నారు. తల, కాళ్లవైపు నుంచి బస్తాల్లో కుక్కారన్నారు. 10 రోజుల క్రితం యువకుడు చనిపోయి ఉంటాడని, ఎక్కడో హత్య చేసి శవాన్ని నాగేపూర్ శివారులో పడేసి ఉంటారని తెలిపారు. మృతుడు రెయిన్‌కోర్టు, రెడ్‌కలర్ టీషర్టు, బ్లాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఎస్‌ఐ వివరించారు. ఘటనాస్థలాన్ని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జీజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇసుక ట్రాలీల పట్టివేత

సాలూర,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):మందర్నా,హున్సా, ఖాజాపూర్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 5 ట్రాలీ ఆటోలను సాలూర తహసీల్దార్ శశిభూషణ్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. వాటిని బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు.

పురుగుమందు డబ్బాతో ఆందోళన



మాజీ కౌన్సిలర్ ఇంట్లో మహాదేవ్, అతడి బంధువులు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యానగర్లోని మాజీ కౌన్సిలర్ ఇంట్లో పలువురు పురుగుమందు డబ్బాతో ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళన చేపట్టారు. పల్వంచ మండలం భవానిపేటకు చెందిన బోయిని మహాదేవ్ తన కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి విద్యానగర్‌కాలనీలో ఓ మాజీ కౌన్సిలర్ ఇంట్లో ఆందోళన చేపట్టారు. మాజీ కౌన్సిలర్ భర్త భవానిపేటలో 5 ఎకరాల 10 గుంటల భూమిని తనకు సేల్ డీడీ చేసి ఇస్తానని రూ.70లక్షలు తీసుకున్నాడని వారు ఆరోపించారు. రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకుండా.. అడిగితే భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. రెండేళ్లుగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న అతడిపై అధికారులు చర్యలు తీసుకొని మహాదేవ్ కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 33మందికి శిక్ష

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్‌ల పరిధిలో మద్యం తాగి వాహనాలను నడిపిన వారికి కోర్టు శిక్షలు విధించిందని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. జిల్లావ్యాప్తంగా 33మంది మద్యం తాగి, వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చారు. ఇందులో 11మందికి ఒక రోజు జైలుశిక్ష, 22మందికి తలా రూ.1000 జరిమానా విధించారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

సుభాష్‌నగర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవి మామిడిపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నుంచి పెన్షన్ డబ్బులు దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు పట్టు కున్నారు. వారినుంచి రూ.8లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబా ద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితులు రాకేష్, సాయి కుమా ర్ అడవి మామిడిపల్లి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బండి నరేందర్ నుంచి పెన్షన్ పంపిణీ కోసం తీసుకొచ్చిన రూ.8లక్షలను ఆగస్టు30న చోరీ చేశారు. అనుమానం రాకుండా సాయికుమార్ ఇంట్లో వాటిని దాచి పెట్టారు. నార్త్‌రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టుచేశారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై రాజశేఖర్, సిబ్బంది రాజేశ్వర్, రాజారెడ్డి, రాకేష్, దత్తాద్రిగౌడ్, రాజు, చరణ్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

రూ.8 లక్షల పటిక స్వాధీనం

ఇందూరు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): గుడుంబా తయారీలో ఉపయోగించే పటికను అధికారులు పట్టుకున్నారు. నాందేడ్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న రైలులో తనిఖీలు నిర్వ హించగా.. 35 సంచుల పటికను పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. దీని విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు. తదుపరి చర్యల కోసం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై హరిబాబు, రైల్వే ఎస్సై సాయిరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ తండాలో గంజాయి స్వాధీనం

రామారెడ్డి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూల్‌తండాలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు రామారెడ్డి ఎస్సై లావణ్య తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పక్కా సమాచారం ప్రకారం స్కూల్ తండాలో దాడులు నిర్వహించగా.. గంగవత్ రాజేందర్ ఇంటి పెరట్లో అక్రమంగా 25 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అవి గంజాయి మొక్కలేనని ఏఈవో శ్రీనివాస్ నిర్ధారిం చారు. వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

మేమూ... ఓటేశాం...!



ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

ముప్కాల్, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, మంచి నాయకున్ని ఎన్నుకోవడంలో ఓటు కీలకపాత్ర పోషిస్తుందని బాల్కొండ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కలెక్టర్‌గా, స్పాట్ పోలీసులుగా, ఎలక్షన్ సిబ్బందిగా వివిధ పాత్రలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్, విజయలక్ష్మీ, రవి, పాష, శైలజ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

రెంజల్,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలికి సాలూర ప్రశాంత్ అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి యువకుడికి మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4 లక్షల ఎల్‌వోసీ చెక్కు మంజూరు చేయించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మొబిన్ ఖాన్ చెక్కును బాధితుడికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సయ్య, శ్రీనివాస్, కార్తీక్, ఖుద్దుస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

ముప్కాల్, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించుకున్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చిన్నయ్య, బుద్ధిరాజ్, శ్రీనివాస్, నర్సయ్య, భాస్కర్, రామ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'దారి'ద్ర్యం

● అధ్వానంగా గ్రామీణ రోడ్లు.. అవస్థలు పడుతున్న ప్రజలు
● టెండర్లు పూర్తయినా.. మొదలు కాని పనులు



అంబం(ఆర్)-వర్ని మార్గంలో గుంతలు

రుద్రూరు,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలో గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఒక ఊరు నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుంతల దారుల్లో ప్రయాణం చేసి ప్రమాదాల బారిన పడుతున్నారు. బండ్లు సైతం పాడవుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు కాలేదు. గత ప్రభుత్వ హయాంలోనే టెండర్ పూర్తయినా పనులు మాత్రం జరగడం లేదు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తే తప్పా రోడ్లు బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి గుంతలు పూడ్చాలని, నిధులు మంజూరైన నిర్మాణాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

● ఏ దారులు ఎలా ఉన్నాయంటే..

వర్ని-కోటగిరి మార్గంలో మండల కేంద్రం నుంచి కోటయ్య క్యాంప్, తగిలేపల్లి, రుద్రూర్ మండలం అంబం(ఆర్), కోటగిరి వరకు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెండర్ వేసిన కాంట్రాక్టర్ వర్ని నుంచి 2 కి.మీల వరకు పనులను చేసి ఆపేశారు. గుంతల రోడ్డుపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

● నిత్యం వందల వాహనాల రాకపోకలు

వర్ని నుంచి కోటగిరి వరకున్న ఆర్అండ్‌బీ రోడ్డుపై రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై గుంతల్లో మోకాలి లోతు నీరు నిలిచినప్పుడు లోతు తెలియక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

● గుంతలు పూడుస్తాం: పవన్, పీఆర్ ఏఈ

రుద్రూర్ నుంచి అంబం(ఆర్) రోడ్డుకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు. తాత్కాలికంగా గుంతలను పూడ్చే పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తాం.

పనులు నాసిరకం.. రోడ్డు ప్రమాదకరం



మోర్తాడ్,సెప్టెంబరు,19(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ శివారులోని వడ్యాట్ రోడ్డులో మత్తడి పనులు నా సిరకంగా జరుగడంతో బీటీ రోడ్డు కుంగిపోయింది. గతంలో కురిసిన వర్షాలకు ముసలమ్మ చెరువు నుంచి వచ్చే ప్రధానకాలువకు వరదలవల్ల మత్తడి ఇరువైపులా తెగిపోయి భారీగుంత పడింది. గత ప్రభుత్వపాలనలో మరమ్మతులకు రూ.1.50 లక్షలు మంజూరుకాగా.. నాసిరకం పనులు చేపట్టారు. దీంతో రోడ్డునగానికి కుంగి పోయిం ది. భారీవాహనాలు ప్రయాణిస్తే ప్రమాదముంది. మరమ్మతులు చేపటాలని కోరుతున్నారు.

● భయంగా రోడ్డుపై వెళ్తున్నాం: దత్తు,అంబం(ఆర్)



వర్ని నుంచి అంబం(ఆర్) వెళ్లాలంటే నరకంగా మారింది. గుంతలమయమైన రోడ్డుపై ఎక్కడ పడతామోననే భయం వెంటాడుతోంది. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించి, మా ఇబ్బందులు తొలగించాలి.

● మరమ్మతులు చేయాలి: ప్రభాకర్, అంబం(ఆర్)



రుద్రూర్ మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. రెండేళ్లుగా ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నాం. అధి కారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించాలి.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



బహుమతులు ప్రదానం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్ , సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. 3 రోజుల పాటు వేల్పూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేత లకు బహుమతులు అందజేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు విజయం కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడా కారులను అన్నివిధాలా ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రేణుక, ఎంపీడీవో బాలకిషన్, హెచ్ఎం రాజన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడునర్సారెడ్డి, జలేందర్, దేవానందం, నర్సింహారావు తదితరులున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కోటగిరి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): పోతంగల్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రభుత్వ భూమి కబ్జాను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. పోతంగల్‌లో 171, 172, 173 సర్వే నెంబర్‌లలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్నారు. ఈ సమస్యపై నాలుగున్నరేళ్ల క్రితం ఫిర్యాదు చేసిపా పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి భూకబ్జాను అడ్డుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేఖర్, రాజు, దత్తు, వెంకట్రావ్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం ప్రవీణ్‌కుమార్

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీసీసీబీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్ సూచించారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో ఎన్‌డీసీసీబీలో అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. అనంతరం బ్యాంక్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. రైతులు బ్యాంక్ నుంచి రుణాలు తీసుకొని, సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, సీఈవో నాగభూషణం, డీజీఎం లింబాద్రి, జక్రాన్‌పల్లి బ్యాంక్ మేనేజర్ బాగారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నడ్పిరాజన్న, టెక్నికల్‌అసిస్టెంట్ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

అమ్రాద్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ మండలం అమ్రాద్ తండాలో కబడ్డీ టోర్నమెంట్‌ను శుక్రవారం కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు దుర్గమాత ఆలయంలో పూజలు చేశారు. అమ్రాద్ తండాలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవిప్రకాష్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహరి నాయక్, జిల్లాధ్యక్షుడు రమవత్‌నాయక్, ప్రధాన కార్యదర్శి పీర్‌సింగ్, తారచంద్, గంగాధర్‌గౌడ్, గంగారాంనాయక్, మాజీఎంపీటీసీ వెంకటేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం



చర్చిస్తున్న కమిటీ చైర్మన్ నర్సయ్య, పాలకవర్గ సభ్యులు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 19: (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి వ్యసాయమార్కెట్ సమవేశం శుక్రవారం చైర్మన్ పాలెపు నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సవవేశంలో రైతుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సరఫరా చేయాల్సిన పరికరాలు తదితర అంశాల గురించి మాట్లాడారు. జూన్, జులై నెలల ఆదాయవ్యయాలపై సమీక్షించారు. ఈసమావేశంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్‌లు మహిపాల్, సాజీద్, మధులత, శ్రీనివాస్. సంపత్, రంజీత్, బాబన్న, లింగారెడ్డి, రాములు నాయక్, ముత్తన్న మార్కెట్ కమిటి కార్యదర్శి మెర్సీ, సూపర్‌వైజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

ఆర్మూర్, సెప్టెంబరు,19(ఆంధ్రజ్యోతి): అంకాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మాజీ సర్పంచ్ గడ్డం రాజన్న స్మారకార్థం క్రీడా దుస్తులను ఆయన భార్య లక్ష్మీ శుక్రవారం అందజేశారు. అమెరికాలోని నివాసం ఉంటున్న రాజన్న కుమారుడు రమేష్‌రెడ్డి క్రీడా దుస్తులను సమకూర్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన వెల్దర్ ప్రసాద్ దేశ నాయకుల చిత్రపటాలను పాఠశాలకు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

వేల్పూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా



నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు

వేల్పూర్ , సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని వేల్పూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల గ్రామాలకు చెందిన సుమారు 60 మందికి పనిచేస్తున్న జీపీ సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, దసరాకు కార్మికులకు యూనిఫామ్‌లు, చెప్పులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్, కామరెడ్డి జిల్లా సంయుక్త ఉపాధ్యక్షులు రాజేశ్వర్, గంగాధర్, భూమయ్య, మధు, రాజన్న, అబ్బుల్ల, బాలమని, సాయమ్మ, రాజగంగారాం, మహేష్, తదితరులు పాల్గొనాన్నారు.

మరమ్మతులు చేయించాలి

భీమ్‌గల్ , సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భీమ్‌గల్, బడా భీమ్‌గల్ గ్రామాల మధ్య వర్షాలకు రోడ్డు, వంతెన దెబ్బతిని రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాలని కోరగా.. మహేష్ కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, మహేష్ తదితరులున్నారు.

జలవికాసంపై అవగాహన

భీమ్‌గల్ రూరల్, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరా సౌరగిరి జలవికాసం కార్యక్రమంపై ఎంపీడీవో సంతోష్ కుమార్ అధికారులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ, అటవీ, ఉద్యాన,ఉపాధిహామీ, భూగర్భజల, విద్యుత్, పంచాయితీరాజ్ శాఖల అధికారులకు ఆయన వివరించారు.

పంటల పరిశీలన

సాలూర, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఫత్తేపూర్, మందర్నా గ్రామాల్లో క్వాలిటీ సీడ్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించారు. ముఖ్యంగా ఆర్డిఆర్ 1200, వరి, పెసర ఎంజీజీ 347 రకం పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటల పెరుగుదల, వ్యాధుల నియంత్రణ, అధిక దిగుబడులు సాధనపై సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాల వినియోగంతో లాభాలు పొందే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమ్యరాథోడ్,రమేష్, ఏవో శ్వేత, ఏఈవోలు సుజాత, అపర్ణ ఉన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

కోటగిరి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): అడ్కాస్‌పల్లిలో శుక్రవారం ఆర్‌డీఆర్ 1200 రకమైన వరిపంటలో తెగుళ్ల నివారణపై కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు అందజేశారు. రుద్రూర్ వరి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఫిర్దోస్ సహనా, ఏవో రాజు, ఏఈవో సతీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



ఇందూర్ మోడల్ హైస్కూల్‌లో బతుకమ్మ దృశ్యం

బోధన్,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ అన్నారు. బోధన్‌లోని ఇందూర్ బీఎడ్ కళాశాలలో, రాకాసిపేట్ ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లలో శుక్రవారం బతుకమ్మ పండుగలను నిర్వహించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మ ఇందూర్ బీఎడ్ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటలాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కిషోర్, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, విద్యావికాస్ కరస్పాండెంట్ శ్రీనివాస్ రావు, వివేకానందా హైస్కూల్ కరస్పాండెంట్ హరికృష్ణలతో ఇందూర్ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పాలనాయుడు, సుధారాణి, చంద్రకళ, తదితరులున్నారు.

సాదాబైనామా కేసులు పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కోటగిరి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సాదాబైనామా కేసులను త్వరితగతిన పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. 22ఏ రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్రం ఏర్పడక ముందు సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, సిబ్బంది తదితరులున్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

రెంజల్,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో రాజశ్రీ సందర్శించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన రావడంతో సిబ్బందిని ప్రశంసించారు. స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్‌లో జిల్లాలో అక్టోబర్ 2 వరకు ఆరోగ్య శిబిరాలు కొనసాగుతాయని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. 188మంది రోగులకు చికిత్సలు అందించినట్లు వైద్యశాఖ అధికారి సహిస్తా ఫిర్దోస్ తెలిపారు. ప్రతీఒక్కరికి ఆరోగ్యాన్ని అందించేందుకు శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడి సూచనలు చేశారు. కార్యక్రమంలో స్త్రీ వైద్యనిపుణురాలు కీర్తి, జనరల్ ఫిజీషియన్ శ్రీకాంత్, డెంటిస్ట్ నీలిమా, కంటి వైద్యురాలు ప్రియాంకలు, డాక్టర్లు వినయ్‌కుమార్, ప్రమోదిత, రవీందర్,రాణి,మహనంది, ఇమ్రాన్, లక్ష్మినారాయణ తదితరులున్నారు.

వైద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

భీమ్‌గల్ , సెప్టెంబరు,19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రవేశపెడుతున్న ఉచిత వైద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపవైద్యాధికారి రమేష్ సూచించారు. స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించగా.. శిబిరాన్ని జిల్లా ఉపవైద్యాధికారి రమేష్ ప్రారంభించారు. అనంతరం ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈయన వెంట వైద్యులు అజయ్‌పవర్, అశ్విని, ప్రవీణ్, భజన్ రెడ్డి, అజయ్, ఫిర్దౌస్ ఫాతిమా, తేజస్విని, డాక్టర్లు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

ఆర్మూర్, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆరోగ్యఉపకేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, వర్షపునీరు నిల్వఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎస్తేరు రాణి, గణేష్, ఆరోగ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఎడపల్లి, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని మరమ్మతుల నేపథ్యంలో పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. బోధన్ రూరల్‌లో కలుర్కి, ఎరాజ్‌పల్లి, ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్, రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్‌ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెగా వైద్య శిబిరం

ముప్కాల్ , సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అందరికి సరిపడా మందులు ఉన్నాయని వైద్యులు సూచించారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించాలి

నవీపేట,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): నవీపేట బస్టాండ్ నుంచి బాసర రోడ్డు మూలమలుపు వరకు డివైడర్‌లోని కోనోకార్పస్ చెట్లను తొలగించాలని యువకులు జీపీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అనారోగ్య సమస్యలు కలిగించే ఈచెట్లను తీసేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, నవీన్, సురేష్, ప్రవీణ్ తదితరులున్నారు.

వచ్చే 11, 12 తేదీల్లో సభలు

నవీపేట,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 11, 12 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం(బీఎల్‌టీయూ) 2వ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు కోరారు. శుక్రవారం నవీపేట, జన్నేపల్లిలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, నర్సయ్య, హరి, లక్ష్మి, సయ్యద్, ఖయ్యుం తదితరులు పాల్గొన్నారు.

కాశీలో సహస్ర చండీయాగం

● ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కాశీలో నవంబర్ 11 నుంచి 15 వరకు సహస్ర చండీయాగం, కోటి దీపోత్సవం కార్యక్రమాలుంటాయని సుదర్శన ఆశ్రమ దండి స్వామి తెలిపారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లి ఆహ్వానం పలికారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ 1800 మంది ట్రస్టు సభ్యులతో సహస్ర చండీయాగం, రుద్రయాగం, కోటి దీపోత్సవ కార్యక్రమాలుంటాయన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నసురుల్లాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వరద బాధితులకు కిట్ల పంపిణీ

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలో తీవ్రంగా నష్టపోయి నిరాశ్రయులైన వరద బాధితులను ఆదుకునేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రావు సమక్షంలో బాధితులకు రిలీఫ్ కిట్లను అందజేశారు. బాధిత కుటుంబాలకు అవసరమైన వంట సామాగ్రితో పాటు, వంటగదికి సంబంధించి ఉపయోగపడే తదితర విలువైన వస్తువులతో కూడిన 35 రిలీఫ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజ్ దాస్, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, జిల్లా వైస్ చైర్మన్ ఏ.నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నాగిరెడ్డిపేటలో వరద బాధితులకు రిలీఫ్ ఫండ్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ బాన్సువాడ డివిజన్ కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలు కొనసాగిస్తున్నారని , అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బోడ అనిల్ , జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్, గోపాల్‌సింగ్ , వినోద్ , శివ తదితరులున్నారు.

కళాకారుల ఆటపాటలను జయప్రదం చేయండి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కళాకారుల పాత్ర మరువలేనిదని కళాకారుల ఆటపాటలను జయప్రదం చేయాలని సాంస్కృతిక సంఘ సమన్వయ కమిటీ నాయకులు దాసు, సిర్పలింగం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది కళాకారులు తమ అమూల్యమైన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలను చైతన్యవంతులు చేశారని అన్నారు. ఈనెల 21న నిర్వహించే ఆటపాట సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, రాధాకిషన్, నర్సారెడ్డి, పోశెట్టి ఉన్నారు.

జిల్లా పరిపాలన అధికారులను కలిసిన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే



ఎస్పీని కలిసి మొక్కను అందజేసిన మాజీ ఎమ్మెల్యే షిండే

నిజాంసాగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే శుక్రవారం జిల్లా పరిపాలన అధికారులైన కలెక్టర్ పోలీస్ సూపరింటెండెంట్‌లను జిల్లా కేంద్రంలోని పరిపాలన అధికారుల కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయన మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలకు నష్టపోయిన పంటలను అంచనా వేయించి పంట నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రను మాజీ ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి మొక్కల అందజేశారు. నియోజకవర్గం పరిస్థితుల గురించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

మున్సిపల్ కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేయాలి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవినీతికి అడ్డాగా మారిన నగర మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రక్షాళన చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లి నీలం రాంచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నగర పాలక సంస్థలో పనిజరగాలంటే ముడుపు చెల్లించకుండా జరగడానికి అవకాశం లేకుండాపోయిందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర నాయకులు శివకుమార్, రమేష్, నర్సింగ్‌రావు, గోపాల్ పాల్గొన్నారు.

వామ్మో చిరుత

» ఇటీవల పశువులపై పెరుగుతున్న చిరుత దాడులు
» మద్నూర్‌లో చిరుత సంచారమంటూ పుకార్లు
» పట్టుకోవాలని గ్రామస్థుల ధర్నా

చిరుతను పట్టుకోవాలంటూ ధర్నా చేస్తున్న మద్నూర్ గ్రామస్థులు





నర్సింగ్‌రావ్‌పల్లి శివారులో చిరుత దాడిలో మృతి చెందిన ఆవు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో గతంలో కంటే కొద్ది మొత్తంలో అడవుల విస్తీర్ణం పెరిగింది. దీంతో అడవులలో ఉండే వన్య మృగాలైన చిరుత లాంటి జంతువులు తమ ఆ హారం కోసం అటవీ ప్రాంతానికి మేతకు వచ్చే పశువులపై దాడి చేసి ఆకలిని తీర్చుకుంటున్నాయి. దీంతో పాటుగానే కొన్ని సందర్భాల్లో సరైన ఆహారం దొరకని సమయంలో చిరుతలు ఆహారం కోసం అటవికి సమీపంలో ఉండే గ్రామాల దగ్గరకు వచ్చి మేకలు, గొర్రెలు, లేగ దూడల వంటి వాటిపై దాడి చేసి ఆకలిని తీర్చుకుంటున్నాయి. దీంతో సంబంధిత గ్రామాల ప్రజలు బెంబెలెత్తుతున్నారు. పిట్లం రేంజ్ పరిధిలో 15 రోజుల వ్యవధిలో చిరుత అన్నారం, నర్సింగ్‌పల్లి, నాగంపల్లి వంటి గ్రామాల పరిధిలో దాడి చేసి లేగదూడల తో పాటు, మేకలను చంపి తినివేసింది. గత ఏ డాది ఇదే సీజన్‌లో పెద్ద కొడప్‌గల్ మండలం కాటేపల్లి శివారు ప్రాంతంలో కూడా చిరుత మేకల మందపై దాడి చేసి మేకలను చంపివేసింది. అంతేగాక మరో సారి ఇదే గ్రామ శివారు లో గొర్రెల మందపై దాడి చేసి గొర్రెలను హతమార్చింది. దీంతో పిట్లం, నిజాంసాగర్ మండలాల పరిధిలో ఏదో ఒక గ్రామ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తుడటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జుక్కల్ ఎఫ్ఆర్‌వో ఏమంటున్నారంటే..

చిరుతల సంచారానికి సంబంధించిన విషయంపై జుక్కల్ ఎఫ్ఆర్‌వో సంతోష్‌ను వివరణ కోరగా మద్నూర్ శివారులో చిరుత సంచరించడం లేదని, అక్కడ తమ సిబ్బందికి లభించిన పాద ముద్రలు చిరుత పాదముద్రలతో సరిపోలేదని తెలిపారు. గ్రామస్థుల అనుమానాన్ని తొలగించేందుకు తమ సిబ్బంది డ్రోన్‌ల సహాయంతో గాలించారని స్పష్టం చేశారు. చిరుతలు ఒకవేళ తమ ప్రాంతాన్ని వదిలి ఇతర ప్రాంతాలకు వచ్చిన అ క్కడే ఒక చోట ఉండవని ని త్యం అవి తిరుగుతూనే ఉంటాయని తెలిపారు. అటవీ ప్రాం తానికి మేత కోసం పశువులు, మేకలు, గొర్రెలను తీసుకెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు.

మద్నూర్ శివారులో చిరుతంటూ పుకార్లు..

ఇటీవల మద్నూర్ మం డల శివారులో చిరుత సం చారం చేస్తుందంటూ, తమకు చిరుత కనపడిందంటూ కొంద రూ రైతులు తో టి వారికి తెలియచేయడం తో చిరుత దాడి చేస్తుందని భయంతో ప్రజలు పంటచేలకు తిరగడం తగ్గించుకున్నారు. ఇక ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో వారు సంబంధిత ప్రాంతానికి వెళ్లి వాటి పాద ముద్రలను సేకరించి అవి చిరుతకు సంబందించినవి కావని ధ్రు వీకరించారు. అయితే తిరిగి రెండోరోజు చిరుత కనపడిందని పుకార్లు వ్యాపించాయి. ఇక చిరుతను అధికారులు పట్టుకోవడం లేదని మద్నూర్ గ్రామస్తులు రహదారిపై ధర్నా నిర్వహించారు. చిరుతను పట్టుకునేందుకు కెమెరాలు అమర్చాలని తొందరగా చిరుతను పట్టుకోవాలంటూ ఆందోళన చేశారు. దీం తో విషయం తెలుసుకున్న బాన్సువాడ ఎఫ్‌డివో సునీ త డ్రోన్ కెమెరాల సహాయంతో గాలించారు. అయి తే చిరుతకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్ళ ల భించక పోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. దీంతో గ్రా మస్థులకు కూడా చిరుత లేదంటూ అధికారులు తెలిపారు.

మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

● డా. షేక్ ముదసిర్



డోంగ్లి పీహెచ్‌సీలో మహిళల వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు

మద్నూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్జన్ వైద్యులు షేక్ ముదసిర్ సూచించారు. శుక్రవారం డోంగ్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమములో భాగంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళల నుద్దేశించి మాట్లాడారు. ఇంటి బాధ్యతలతో సతమతమవుతూ తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా ఉంటున్న మహిళలు దీర్ఘకాలిక వ్యాధుల గురించి పట్టించుకోకపోవడం వల్ల అవి ముదిరి వారి ప్రాణాలను హరిస్తున్నాయని మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు నిర్వహిస్తుందని. ఇందులో భాగంగా మండలంలోని ఆరు కేంద్రాలలో మహిళలకు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్యాంపులో మహిళలకు బిపి, షుగర్, ఓరల్ బ్రెస్ట్ సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించి స్క్రీనింగ్ నిర్వహిస్తారని, రక్తహీనతకు గురికాకుండా ఉండే లా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారని, మహిళలకు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని గుర్తు చేశారు. డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో 71 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డోంగ్లి పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలైన డోంగ్లి, కోడ్చిర, ఎన్ బూర, లచ్చన్, మేనూర్, మద్నూర్ ఏ, బిలలో గాంధీ జయంతి వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు ఈ శిబిరాలలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు.

మద్నూర్ గురుకుల విద్యార్థులకు అందని కాస్మెటిక్ చార్జీలు

మద్నూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల కళాశాలలో విద్యార్థులకు నెల నెలా ఇచ్చే కాస్మెటిక్ చార్జీలు 13 నెలలుగా ఇవ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. శుక్రవారం పలువురు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ విషయమై ప్రిన్సిపాల్‌కు అడిగినట్లు తెలిసింది. మద్నూర్ గురుకుల విద్యాలయంలో గత ఏడాది ఇన్‌చార్జిగా ఉన్న ప్రిన్సిపాల్ 10 నెలల కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదని, ఆ తర్వాత వచ్చిన ప్రస్తుత ప్రిన్సిపాల్ మూడు నెలలుగా కాస్మెటిక్ చార్జీలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కాస్మెటిక్ చార్జీలు ప్రతీనెల విద్యార్థుల ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ముందుగా గురుకుల విద్యాలయ సంస్థ వారు పాఠశాలకు సంబంధించిన ఖాతాలో నిధులు జమ చేస్తారు. ఆ తరువాత వాటిని సంబంధిత సిబ్బంది ఆయా విద్యార్థుల ఖాతాలోకి జమ చేయాల్సి ఉంటుంది. గత 13 నెలలుగా కాస్మెటిక్ చార్జీలు ఇవ్వక పోవడంపై తల్లిదండ్రులు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయ నిబంధనల మేరకు ఐదవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు ప్రతినెల విద్యార్థికి రూ. 105 చొప్పున, ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు రూ.230 చొప్పున విద్యార్థుల ఖా తాలోకి జమ చేయాల్సి ఉంది. ఇంతవరకు జమ చేయకపోవడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ గంగాకిషోర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా విద్యార్థుల ఖాతాలోకి జమ చేయాల్సిన కంప్యూటర్ ఆపరేటర్ తమ వద్ద లేకపోవడం వల్ల ఆలస్యం జరిగినట్లు వెల్లడించారు. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఒక నెలకు సంబంధించిన కాస్మెటిక్ చార్జీలు వేశానని మరో మూడు నెలల కాస్మెటిక్ చార్జీలు వేయాల్సి ఉందని తెలిపారు. మూడు రోజుల్లో విద్యార్థుల ఖాతాలోకి 13 నెలలకు సంబంధించిన కాస్మెటిక్ చార్జీలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చినా

పూర్తి కాని మరమ్మతు పనులు

● రైతులకు నష్టపరిహారం అందించాలి

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు, రోడ్లు ధ్వంసం కాగా నేటికీ మరమ్మతు పనులు పూర్తి కాకపోవడం ప్రభుత్వం, అధికారుల చేతకానితనానికి నిదర్శనమని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఫామ్ హౌస్‌లో విలేకరుల స మావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భారీ వర్షాలతో రహదారులన్నీ ధ్వంసం అయ్యాయని వీటి మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశా రు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి వచ్చి వెళ్లిన మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడం ప్రభుత్వ చేత గానితనానికి నిదర్శనం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన లింగంపల్లి బ్రిడ్జ్‌ను వెంటనే పూర్తి చేసి దసరా, దీపావళి పండగ పూట రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు, సాయిలు, శ్రావ ణ్, ఇమ్రాన్, అరవింద్ గౌడ్, రాజయ్య, దేవదాస్, పృథ్వీరాజ్, బబ్లు, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలించిన ఏడీఏ



భైరాపూర్‌లో వరి పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ అరుణ

బీర్కూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలోని బీర్కూర్, భైరాపూర్ గ్రామాల శివార్లలో వరి పంటలను శుక్రవారం ఏడీఏ అరుణ పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి పంటకు ఎండాకు తెగులు వచ్చిందని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె కూడా వరి పంటలను పరిశీలించి ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించారు. తెగులు నివారణకు సంబంధించి ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. పిలకలు తొడిగె దశలో ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, వీటి చుట్టూ దాగు మచ్చలుగా మొదలై అంచుల వెంబడి మట్టల వరకు వ్యాపిస్తాయని తెలిపారు. పసుపు పచ్చ జిగురువంటి బ్యాక్టీరియా ఎండ వేడిమికి గట్టిపడి చిన్న చిన్న ఉండలుగా ఏర్పడతాయన్నారు. తెగుళ్ల నివారణకు నత్రజని ఎరువులను వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయాలన్నారు. అనంతరం ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు + కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పంటలకు పిచికారి చేయాలన్నారు. అలాగే అగ్రిమైసిన్ 0,4 గ్రాములు.+కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల లీటరు నీటిలో కలిపి పంటలపై స్ప్రే చేయాలని సూచించారు. ఆమె వెంట రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై విద్యార్థులకు అవగాహన



ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధర్

నసురుల్లాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో ఉన్న ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి భారత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటి గురించే సమగ్రంగా తెలుసుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విదార్థులను వివరించి చైతన్య పరచాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టినప్పటికి అవగాహన లేకపోవడం వలన ఎన్నో సంక్షేమ పథకాలు నిరుపయోగంగా మిగిలి పోతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బున్ని వినయ్ కుమార్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, రాజేష్, అధ్యాపకులు చిరంజీవి, అంబయ్య, శంకర్రావు, విఠల్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. అనంతరం ఎల్లారెడ్డి కోర్టు ఎదుట నిరసన తెలిపారు సందర్భంగా ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీద్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బార్ అసోసియేషన్ ఈసీ సభ్యుడు తన్నీరు శ్రీకాంత్ పై గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల దాడి చేశారన్నారు. ఈ దాడిని నిరసిస్తూ తాము విధులను బహిష్కరించినట్లు తెలిపారు. తెలంగాణ బార్ అసో సియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరించామని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు నవీద్ ఈ సందర్భంగా సష్టం చేశారు. హైదరాబాద్‌లో న్యాయవాదిపై దాడులు చేసిన వారికి కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు ఈ సందర్భంగా కోరారు. నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

వేతన బకాయిలను ఇప్పించాలి



పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక వేతన బకాయిలను వెంటనే ఇప్పించాలని గ్రామ పంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ అధికారిని కలిసి వేతన బకాయిలు విడుదల చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాలు తక్కువగా ఉంటాయని చాకిరి ఎక్కువగా ఉంటుందని అయినా కానీ కార్మికులు పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా నాయకులు శ్యామ్‌సన్, అబ్దుల్, గంగాధర్, లక్ష్మణ్, గంగాధర్, పోశెట్టి, సాయిలు, తదితరులు ఉన్నారు.

అభ్యాస పాఠశాలలో బాలల మహోత్సవం



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్‌నగర్‌లో అభ్యుదయ పాఠశాలలో శుక్రవారం బాలల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు లఘు నాటికను, యాంకరింగ్, స్క్రిప్ట్, పర్యావరణ సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత సమయపాలన, రామాయణ హితిహాసాల్లోని లఘు నాటికలు, తెలంగాణ జానపద ఆటపాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణ, నిర్వాహణ, నైపుణ్యం, సృజనాత్మకత చదువుతో పాటు ఉండాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం బాలల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, హెచ్ఎం మాధవి, చైతన్య పాల్గొన్నారు

మత్తు పానీయాలను నియంత్రించాలి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్ కల్తీకల్లు, మత్తు పానియాలను నియంత్రించాలని వాటికి సంబంధించిన ఉత్పత్తులను నిషేదించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్, పీవోడబ్ల్యూ సంఘ నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నాయకులు అదనపు కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించే లంబాడ పోరాట హక్కుల ధర్నా కార్యక్ర మానికి వెల్లకుండా మండలానికి చెందిన లంబాడ పోరాట హక్కుల నాయకులను పోలీసు లు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు లంబాడాల సమస్యలపై నిర్వహించే సభకు వెల్లకుండ ప్రభుత్వం తమను నిర్బంధించడం దారుణమన్నారు. ప్రతీ ఒక్కరికి తమ బాధలకు చెప్పుకునే హక్కు ఉందని, తాము సమస్యల సాధనకోసం నిర్వహించే సమావేశానికి వెల్లకుండ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని తెలిపారు. అనంతరం లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం నిరసిస్తూ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు శ్రావణ్ జాదవ్, గణపతి నాయక్, రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం



నసురుల్లాబాద్ గిరిజన గురుకులంలో అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పోలీస్ షీ టీం సభ్యులచే శుక్రవారం నస్రులాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో వి ద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు అనిల్, ప్రియాంక మాట్లాడుతూ పో స్కో యాక్ట్ గురించి, సైబర్ నేరాలు ఏవిధముగా జరుగుతున్నయో వి ద్యార్థులకు వివరించారు. అనంతరం నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.. వేసవి సెలవుల్లో జరిగే దొంగతనాలను నివారించుటకు అత్యవసర సమయంలో 100 నెంబర్‌కి కాల్ చేయడం మరిచిపోవద్దని, సోషల్ మీడియా నందు జాగ్రత్తగా ఉండాలని టీచర్లకు తెలియజేయ డం జరిగిందన్నారు. మహిళల కోసం ఎల్లవేళలా షీ టీమ్ అందుబాటులో (షీ టీమ్ నెం. 87126 86094) అవగాహన కల్పించామన్నారు.

ట్రాన్స్‌జెండర్‌లకు బతుకమ్మ, దసరా కానుక


కానుకలు అందిస్తున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ట్రాన్స్‌జెండర్లకు బతుకమ్మ, దసరా కానుకలను శుక్రవారం అందించారు. తనవంతు సాయంగా చీరలను కానుకలుగా అందించామన్నారు. పట్టణ తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌లు వంశీ, లావణ్య, రమేష్, శ్రీనివాస్, కిరణ్, నిరంజన్, పాల్గొన్నారు.

సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు


తిమ్మారెడ్డిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు.

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 19: మండల పరిధిలోని తిమ్మారెడ్డి గ్రామ రైతులు వేసిన పంటల సాగు వివరాలను శుక్రవారం ఏఈవో రాజాగౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వర్షాకాలంలో రైతులు వేసిన పంటలకు డిజిటలైజేషన్ చేసే ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అదేవిధంగా వ్యవసాయదారులు కీలకదశలో ఉన్న పంటల సంరక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని సూచించారు. ఆయన వెంట స్థానిక రైతులు ఉన్నారు.

చౌదరీ చెరువు పునరుద్ధరణ పనులు


పొల్కంపేటలో కుంటను పరిశీలిస్తున్న సీఈ

లింగంపేట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన చెరువులను, కుంటలను తాత్కాలికంగా పునరుద్ధరిస్తున్నామని నీటి పారుదల శాఖ సీఈ శ్రీనివాస్ అన్నారు. శక్రవారం ఆయన లింగంపేట మండలంలోని పొల్కంపేట చౌదరీ చెరువును, మత్తడి కుంటలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చెరువులో నీటిని నిల్వ చేసేందుకు తాత్కాలిక మరమ్మతు పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ పంటలు పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో శాశ్వత పనులను చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ యశస్విని, ఈఈ మల్లేష్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్, సిబ్బంది ఉన్నారు.

ఇంచార్జి ఎంఈవోకు సత్కారం

మహమ్మద్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గాలిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఇంచార్జి ఎంఈవో అమర్‌సింగ్ ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో మండల ఉపాధ్యాయులు మండలకేంద్రంలోని సొసైటీ ఫంక్షన్‌హాల్‌లో వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు, ఆయా పార్టీల నాయకులు ఆయన్ను శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ.. అమర్‌సింగ్ ఉపాధ్యాయ వృత్తిలో 30ఏళ్లపాటు ఎంతోమంది విద్యార్థులను ప్రయోజకులను చేశారన్నారు. డీఈవో రాజు, మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, నిజాంసాగర్ ఎంఈవో తిరుపతి రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు కుషాల్, వెంకటరాములు, వెంకట్రాంరెడ్డి, సంతోష్, వెంకన్న, పండరి, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మండల నూతన కాంగ్రెస్ కమిటీ ఎంపిక

రామారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొగుళ్ళ ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నేతృత్వంలో పార్టీ మండల ఉపాధ్యక్షులుగా నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ల్యాగల ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఎండీ.రఫూఫ్, కార్యదర్శిగా అటికెల కిషన్ యాదవ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా లక్కాకుల రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా తూర్పు రాజు, రంగు రవీందర్ గౌడ్, నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పిప్పరి లింగం, వెంకట్ స్వామి, అరవింద్ గౌడ్, కిషన్ గౌడ్, ఠాగూర్ విజయ్ సింగ్‌లను ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మొగుళ్ళ ప్రవీణ్ గౌడ్ తెలిపారు. పార్టీ బలోపేతానికై తమవంతుగా పాటుపడతామని నూతన సభ్యులు తెలిపారు.

పరిసరాల్లో నిల్వనీరు లేకుండా చూసుకోవాలి


నిల్వనీటిని తొలగింపజేస్తున్న అధికారులు

రాజంపేట, బాన్సువాడ రూరల్, దోమకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ఎల్లారెడ్డిపల్లి, కొండాపూర్, ఆరేపల్లి, గుండారం తదితర గ్రామాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ రఘురాం మాట్లాడుతూ.. గ్రామాలలో పరిశుభ్రతపై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీటినిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శు లు అశోక్ కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, వంశీకృష్ణ, శ్రీజ, ఏఎన్ఎం, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

● బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామపంచాయతీ అధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు ఇంటింటికీ తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పరిసరాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ.. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. దీంతో డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండలో విద్యార్థుల మానవహారం

● దోమకొండ మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్య కార్యక్రమాలు, విద్యార్థులతో మానవహారం, వ్యాసరచన పోటీలను ప్రత్యేకాధికారి జ్యోతి నిర్వహించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యసిబ్బందితో కలిసి ఇంటిచుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


ఎస్పీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని మహిబాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌పై దాడిచే సిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకో వాలని పంచాయతీ కార్యదర్శుల సం ఘ జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఎస్పీ కార్యాల యంలో శుక్రవారం ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిబాపూర్ గ్రామానికి చెందిన కారేగామ అశోక్‌రెడ్డి అనే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడడంతో పాటు గ్రామస్థులందరి ముందే భౌతికంగా దాడిచేశాడని ఆరోపించారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని కలె క్టర్‌తో పాటు ఎస్పీకి ఫిర్యాదుచేశామని అన్నారు. పంచాయతీ కార్యద ర్శులు రాజు, విజయ్‌రాథోడ్, లింగురాం పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 22న ప్రారంభమయ్యే దుర్గాదేవి నవ రాత్రి ఉత్సవాల్లో పోలీసు బందోబస్తు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. డీజేలకు అనుమతులు లేవని భక్తి శ్రద్ధలతో సంప్రదాయాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించడానికి పోలీసుశాఖ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

నిబద్ధత, క్రమశిక్షణతో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శుక్రవారం కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో సాయుధ రిజర్వ్ పోలీసు సిబ్బంది, హోంగార్డులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరదల సమయంలో ప్రతీ పోలీసు అధికారి చేసిన కృషిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా అభినందించారని తెలిపారు. పోలీసు సిబ్బంది పనితీరుపైనే పోలీసుశాఖ ప్రతిష్ఠ ఆధారపడుతుందని అన్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి వెంటనే రివార్డులు అందజేయబడతాయని అలాగే తప్పులు జరిగితే తగిన శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విధులకు ఎట్టి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కావద్దని, అవసరమైతే సరైన కారణంతో మాత్రమే లీవ్ తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. విధుల్లో గాని వ్యక్తిగత జీవితంలో గాని ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తనకు తెలియజేయవచ్చని తెలిపారు. అనంతరం హోంగార్డులకు రేయిన్‌కోట్స్, వులెన్‌జెర్సీలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ


మాట్లాడుతున్న రూరల్ సీఐ రమణ

రామారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ పేర్కొన్నారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ నాయకులు అనుమతి లేకుండా ధర్నాలు నిర్వహించకూడదని సూచించారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు చట్టరీత్యా కేసులు తప్పవన్నారు. పోలీస్ స్టేషన్‌కు అనుకొని ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుపై వాహనాలు పెడితే ఊరుకునేది లేదని తెలిపారు. కార్యక్రమంలో రామారెడ్డి ఎస్సై ఆర్. లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జాబితా నుంచి మూడు ఇళ్ల తొలగింపు

రామారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సక్రమంగా నిర్వహించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో, రామారెడ్డి మండల విచారణ అధికారి సురేందర్ పేర్కొన్నారు. రామారెడ్డి ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంతో పాటు ఉప్పల్వాయి, గిద్ద, ఇసన్నపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. పదకొండు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించగా మూడింటిని లిస్టులో నుంచి తొలగించినట్లు వివరించారు. కార్యక్రమంలో రామారెడ్డి ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, మండల పంచాయతీ అధికారి ఏలేటి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని రామారెడ్డి మండల ప్రత్యేక అధికారి డా.భాస్కరన్ పేర్కొన్నారు. మండలంలోని పోసానిపేట్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శుభ్రతపై పలు సూచనలు చేశారు. రామారెడ్డి ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, మండల పంచాయతీ అధికారి తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, ఆరోగ్య సూపర్ వైజర్ జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన రెడ్డిపేట విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పల్వాయి గ్రామ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో జరిగిన జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో శుక్రవారం రెడ్డిపేట్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వాలీబాల్ క్రీడాకారులు విజయం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అండర్- 17 బాయ్స్ విభాగంలో జి.జగన్, అండర్-17 బాలికల విభాగంలో యల్.వైష్ణవి, డి.సంధ్య, అండర్-14 బాలికల విభాగంలో జీ. రక్షిత, ఎస్.నీలిమ, జి.బిందు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ మేరకు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు స్వామి, సత్యం, రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడితే ప్రాణాలకే ముప్పు

● ఇంఫాక్ట్ మోటివేషనల్ స్పీకర్ సంజీవులు

లింగంపేట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు అలవాటు పడితే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇంఫాక్ట్ మోటివేషనల్ స్పీకర్ సంజీవులు అన్నారు. శుక్రవారం లింగంపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆదేశాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మత్తుపదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే తల్లిదండ్రులకు, సమాజానికి దూరమవుతారని ఆయన తెలియజేశారు. గురువుల ఆజ్ఞలను ఎప్పటికప్పుడు పాటిస్తూ మంచి స్నేహితులను ఏర్పాటుచేసుకొని మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఒక లక్ష్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు రాజయ్య, దుర్గయ్య, స్వామిగౌడ్ నాగు, దర్‌సింగ్, శ్రీలత, షైమద్, సంధ్య ఆనంద్‌రెడ్డి, అభినవ్, నాగయ్య, విద్యార్థులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవులు

కన్నీరు కార్చడం కాదు.. సాయం చేయండి

● మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

సదాశివనగర్, సెప్టెంబరు 19: వరద బాధితుల కష్టాలను చూసి మాటలు చెప్పి కన్నీరు కార్చడం కాకుండా ఆర్థిక సహాయం అందచేసి ఆదుకోవాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శు క్రవారం సదాశివనగర్ మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరదలు సంభవించి 20రోజులు దాటాయి, ముఖ్యమంత్రి పర్యటించి 10 రోజులు దాటినా వరద బాధితులకు ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందకపోవడం చాలా బాధాకర మన్నారు. వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినప్పటికీ సరైన అంచనా లేక కొంత భాగమే నష్టం వాటిల్లిందని రికార్డుల్లో చూపుతూ చేతులు దులుపుకోవడం సరైనా పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధికంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రైతులు నష్టపోయారని అన్నారు. త్వరగా ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం అందజేయాలన్నారు. లింగంపేట్ మండలంలో రెండు పెద్దచెరువులకు గండి పడటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని త్వరగా గండి పూడిస్తే వేసవి పంటలకు కొంతైనా నీరు అందుతుందన్నారు. కాలయాపన చేయకుండా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రూ.200ల కోట్లు ప్రకటించి సత్వరమే విడుదల చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. మాజీ జడ్పీటీసీలు రామేశ్వర్‌రావు, కమిలి నర్సింలు, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోహినుద్దీన్, మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కమలాకర్‌రావు, శ్రీనివాస్ నాయక్, మర్కంటి బుచ్చయ్య, గడీల భాస్కర్, శివాజీ రావు, గైని రమేష్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అతివలకు ఆరోగ్య పరీక్షలు

ఎల్లారెడ్డి రూరల్, బాన్సువాడ రూరల్, భిక్కనూరు, సెప్టెంబరు 19: మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్లారెడ్డి మండల పరిధిలోని మత్తమాల, వెల్లుట్ల గ్రామాల్లో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి శరత్ తెలిపారు. మత్తమాలలో డాక్టర్ వెంకటసుబ్బయ్య 90 మంది మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. 9 మంది రక్తనమూనాలు సేకరించి టీ హబ్‌కి నిర్ధారణ కొరకు పంపించామన్నారు. డాక్టర్ జనార్దన్, సూపర్‌వైజర్ రాణి, ఏఎన్ఎంలు ఇందిరా, ప్రమీల, హసీనా, జ్యోతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో మహిళలకు వైద్యపరీక్షలు

● బాన్సువాడ మండలం హన్మాజీపేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్రాన్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. జనరల్ ఫిజీషియన్ మన్నె సాయిలు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.


జంగంపల్లిలో వైద్యశిబిరం నిర్వహిస్తూ..

● భిక్కనూరు మండలం జంగంపల్లిలో 72మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యురాలు విజయలక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజూర్, లావణ్య, గంగమణి, డీఆర్పీ సుధాకర్, లింక్ వర్కర్ లావణ్య, ఏఎన్ఎంలు వినోద, శ్రీలత, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. సూపర్ వైజర్ పాప, ఆరోగ్య సిబ్బంది లక్ష్మణ్, పండరి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణమే.. ప్రమాదమాయే..!


అమర్లబండ, కన్కల్ గ్రామాల మధ్యలో కొట్టుకుపోయిన రోడ్డు

సదాశివనగర్, సెప్టెంబరు 19: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అమర్లబండ, కన్కల్ గ్రామాల మధ్య బీటీరోడ్డు ప్రమాదంగా మారింది. ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా రోడ్డుపై నీరు ప్రవహించి కింది భాగం లోయ ఏర్పడి బీటీ కొట్టుకుపోయింది. కొద్ది భాగమే స్థలం ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. వర్షాలు ఆగిపోయి 20 రోజులు దాటినప్పటికీ ఆ ప్రాంతాన్ని చూసిన నాథుడు లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యం సరిచేయాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో


వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేకవైద్య శిబిరాలలో భాగంగా నిజామాబాద్ నగరంలోని మాలపల్లి పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లకు పలు సూచనలు చేశారు. మహిళల సమస్యలు చెవి, ముక్కు, గొంతు, ఎముకలకు సంబంధించిన సమస్యలు, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య సమస్యలపై వైద్య నిపుణులతో చర్చించారు. అవసరమైన రోగులకు ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సిందిగా సూచించారు. ప్రత్యేక వైద్యశిబిరంలో సుమా రు 200 మంది రోగులను పరీక్షించి 12మంది రోగులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, జనరల్ మెడిసిన్ డాక్టర్ రాణాప్రతాప్, జనరల్‌సర్జన్ డాక్టర్ క్రిస్టినా, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ అక్షయ్‌కుమార్, నాగనాయక్, సతీష్, పీహెచ్‌సీ సిబ్బంది శ్యామల, షాదుల్లా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 19: మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన పశువైద్యులు అంజనేయులు తల్లి అంత్యక్రియల్లో శుక్రవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నర్సింలు, సాయిలు, నాయకులు రాజు, గుల విఠల్, గంగారెడ్డి, మనోజ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా..? జాగ్రత్త

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సెలవులకు ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. పండుగ సందర్భంగా ఊళ్లకు వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనుమానితుల సమాచారం అందించి చోరీల నివారణకు సహకరించాలని కోరారు. ఉదయం వేళ రద్దీపేపర్లు, ఖాళీసంచులు, పూలమొక్కలు విక్రయించే వారిపై దృష్టి పెట్టాలన్నారు. విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి వెళ్లకూడదన్నారు. ఖరీదైన వస్తువులను ఇంటిలో ఉంచకుండా లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

తిరుమల తిరుపతి జెండాకు ప్రత్యేక పూజలు

రామారెడ్డి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవుని జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రంగు రవీందర్ గౌడ్, మాజీ సర్పంచ్ దండబోయిన సంజీవ్, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, ధర్మకర్తలు, నాయకులు సుంకోజి గంగాధర్, ల్యాగల మహిపాల్, శ్రీనివాస్ గుప్తా, కాసర్ల మారుతి, గంగాధర్, తిరుపతి భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

అంగన్‌వాడీలో పోషణ్ మహోత్సవ్

బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని బోర్లం గ్రామపంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సౌభాగ్య మాట్లాడుతూ.. చిన్నారులకు, గర్భిణులకు పోషకాహారం పట్ల అవగాహన కొరకు ఆహార తయారీలపై వంటకాల పోటీలను నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. పౌష్టికాహారం అందించడం వలన పిల్లల్లో ఎదుగుదలతో పాటు దృఢత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధురి, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, విజయలక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గర్భిణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సరుకులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ

తాడ్వాయి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన 12 మంది బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర వస్తువులు, టార్పలిన్ కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా చైర్మన్ రాజన్న, సెక్రెటరీ రఘుకుమార్, పీవీ నరసింహమ్, డివిజన్ చైర్మన్ గడ్డం రమేష్ రెడ్డి, మండల తహసీల్దార్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీకి పరామర్శ

దోమకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌ను శుక్రవారం మాజీ జడ్పీటీసీ తిరుమలగౌడ్ కలిశారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందడంతో ఆయనను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి
ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ
మహేశ్వరి మిరాయి
వెంకటేశ్వర లిటిల్ హార్ట్స్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.150
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230